# ప్రతిభ

కమల్‌హాసన్ నటనకో... కపిల్‌దేవ్ ఆటకో... బాలసుబ్రహ్మణ్యం పాటకో... శ్రీదేవి అందానికో.... మనకి తెలీకుండానే ఆకర్షితులవుతాం !

ప్రతిభకి అంత గుర్తింపు ఉంటుంది కాబట్టి ఏదో ఒక రంగంలో ప్రతిభావంతులం కావాలని ఉవ్విళ్ళూర్తాం!

ఒకవేళ మనలో ఏ ప్రతిభా లేకపోతే కనీసం ప్రతిభావంతులని చూసి మురిసిపోతాం... ముగ్ధులవుతాం !

ప్రతిభావంతులకెప్పుడూ ఎంతో కొంత 'జనాకర్షణ' శక్తి ఉంటుంది కాబట్టి... వాళ్ళ వెంట మనం పరుగులు తీస్తాం ! ఆటోగ్రాఫ్‌ల కోసం ఎగబడ్తాం !

కొందర్ని అభిమానిస్తాం !

**'అభిమానం'**లో విచక్షణ మరుగున పడిపోతుంది ! మనమిష్టపడేవాళ్ళమీద ఈగ వాలినా సహించలేం ! వాళ్ళ బలహీనతల్ని విమర్శించిన వాళ్ళమీద రంకెలేస్తాం! వీలైతే తన్నడానికైనా సంసిద్ధపడతాం! వాళ్ళ మీద మన ఇష్టాన్ని నిరూపించుకోవడానికి వారికోసం ప్రాణత్యాగానికైనా వెనుదీయని వీరాభిమానులమవుతాం !

**'ఆరాధన'**లో స్వార్థముండదు! మనమిష్టపడినవాళ్ళు మనను ఇష్టపడాలనుకోం! వాళ్ళకి దగ్గరకావాలని ఆశించం! వాళ్ళపట్ల మన ఇష్టాన్ని మరొకరి దగ్గర ప్రదర్శించాలని కూడా భావించం! మన ఇష్టాన్నంతా గుండెల్లోనే గుప్తంగా దాచుకుంటాం!

**'ఆకర్షణ...'** నీటి బుడగలాంటిది ! ఎప్పుడే క్షణాన అది టప్పున పేలిపోయి... తన ఉనికి కోల్పోతుందో చెప్పలేం! ఈ రోజు ఇష్టపడ్డ వాళ్ళనే మరోరోజు అసహ్యించుకుంటాం! వాళ్ళనిష్టపడ్డప్పుడు... ఎవరెంత కాదన్నా.... వాళ్ళలో మనకంతా 'గొప్పతనమే' కన్పిస్తుంది! అసహ్యించుకున్న క్షణాల్లో ఎవరెంత నచ్చచెప్పినా వాళ్ళలో మనకన్నీ 'లోపాలే' కన్పిస్తాయి !

జనాకర్షణ ఆయుష్షు అతి స్వల్పమనీ... మన అభిమానుల 'అభిమానం' దెబ్బతినేలా ప్రవర్తిస్తే.... మనకన్నా ప్రతిభావంతులైన వాళ్ళు రంగంలోకొచ్చినపుడు... జనం మనల్ని మరిచి... వాళ్ళ వెంట పరుగులెడ్తారనే సంగతి..... మనం ఉచ్ఛ స్థానంలో ఉన్నప్పుడు విస్మరిస్తాం!

మనకు జనాకర్షణ శక్తి ఉందనీ... జనం మనమేం చేసినా గుడ్డిగా నమ్మేస్తారని భావిస్తే... జనం కీలెరిగి వాతపెడ్తారు!

మనం దైవాంశ సంభూతులమనీ... ఎవరిలోనూ లేని 'ప్రతిభ' మనలో దాగుందన్న అహంకారంతో.. కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తే....మనం ఏ ప్రతిభా లేదనుకునే వాళ్ళందరూ 'ఒక్కటై' - తమ ప్రతిభేమిటో ప్రదర్శిస్తారు!

1-9-1995